క్లుప్తంగా

'పది' టాపర్లకు నగదు పురస్కారం



బల్మూర్: 2024–2025లో 'పది' పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన టాపర్లకు శనివారం క్లాస్‌మెంట్ క్లబ్ అచ్చంపేట వారి ఆధ్వర్యంలో కొండనాగుల ఉన్నత పాఠశాలలో నగదు పురస్కారంతో పాటు శాలువాతో ఘనంగా సన్మానించారు. బల్మూర్, గోదల్, కొండనాగుల, తుమ్మెన్‌పేట ప్రభుత్వ పాఠశాలలకు చెందిన అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదుతో పాటు ప్రశాంసా పత్రాలు ఎంఈఓ విష్ణుమూర్తి, క్లాస్‌మెంట్ క్లబ్ రాష్ట్ర అధ్యక్షుడు పోల శ్రీనివాస్ అందజేశారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు

లింగాల: మండలంలోని అంబట్‌పల్లి ఉన్నత పాఠశాలలో 9,10 తరగతులు చదువుతున్న 10 మంది విద్యార్థులకు ఉల్లాస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. జనరల్ నాలెడ్జి పోటీలు ఏర్పాటు చేసిన సంస్థ వారు ఉత్తమ ప్రతిభ కనబర్చిన తరగతికి 5 మంది చొప్పున ఎంపిక చేసి, ఒక్కొక్కరికి రూ. 1000 చొప్పున రూ.10 వేలు అందజేశారు. విద్యార్థులను చదువులో ప్రోత్సహించడానికి పోటీలు ఏర్పాటు చేసినట్లు హైదరాబాద్‌కు చెందిన కమ్మ మహేష్, కమ్మ జగదీష్ తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి రాములు, హెచ్ఎం నిరంజన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీజేపీ కార్యకర్తల అరెస్టు

అమ్రాబాద్: 9 మంది బీజేపీ కార్యకర్తలను అదుపులోకి తీసుకొని సొంత పూచికత్తుపై వదిలేశారు. ఉమామహేశ్వరం, మద్దిమడుగు పబ్బతి ఆంజనేయస్వామి దేవాలయం వద్ద టోల్‌గేట్ తొలగించాలని, ఉమామహేశ్వరం వెళ్లే భక్తులకు ప్రభుత్వ బస్సులో ఉచిత టికెట్‌లు ఇవ్వాలని బీజేపీ ధర్నా కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.

లింగాల: పాదయాత్రకు వెళ్లకుండా పోలీసులు పలువురు నాయకులను ప్రభుత్వ ముందస్తు అరెస్ట్‌లు చేయడం తగదని బీజేపీ మండల అధ్యక్షుడు గువ్వని నవీన్ అన్నారు.

అచ్చంపేట రూరల్: మండలంలోని బీజేపీ నాయకులను ముందస్తు అరెస్టు చేశారు. అచ్చంపేట, సిద్దాపూర్ పోలీస్‌స్టేషన్లకు తరలించారు.

తల్లిదండ్రులకు పాదపూజ



వెల్దండ: మండలంలోని కొట్రతండా శాస్త్ర ఇంటర్నేషన్ స్కూల్‌లో శనివారం విద్యార్థులు స్నేహితుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు ఒకరికి ఒక్కరు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విద్యార్థులు తల్లిదండ్రులకు పాదపూజ నిర్వహించారు. కార్యక్రమంలో చైర్మన్ గుబ్బ ఈశ్వరయ్య, డైరెక్టర్లు నరేష్, సాయిస్వరూప్, స్వర్జన్‌బాబు, ప్రిన్సిపల్ రవితేజ, మైహాస్ ఉన్నారు.

అభయాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు



చారకొండ: మండలంలోని రాంపురంలో అటవి ప్రాంతంలో ఉన్న అభయాంజనేయుడికి అర్చకుడు లక్ష్మణశర్మ స్వామివారికి ప్రత్యేక అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఏటా గ్రామంలో శ్రావణ శనివారం స్వామి వారికి పూజలు చేయడం, గ్రామస్తులు పాల్గొనడం ప్రత్యేకత అని గ్రామస్తులు వివరించారు. కార్యక్రమంలో సత్తూరి జంగయ్య, నరేందర్, శేఖర్, గ్రామస్తులు ఉన్నారు

దాతల సహకారంతో వీధిలైట్ల ఏర్పాటు

తెలకపల్లి: మండలంలోని గౌరారంలో వీధిలైట్లను ఏర్పాటు చేస్తున్నారు. మూడేళ్లుగా గ్రామంలో వీధిలైట్లు లేక పాములు, తేళ్లు, పురుగులు సంచరిస్తున్నాయని, బయటి వెళ్లాలంటే భయభ్రాంతులకు గురయ్యేవారు. దీంతో గ్రామానికి చెందిన బోయ మల్లయ్య, బిచ్చిసాయబ్ సొంత ఖర్చులు లక్షరూపాయలు వెచ్చించి గ్రామంలో ఉన్న వీధిలైట్లను ఏర్పాటు చేశారు. వారికి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

అటవీభూములకు పట్టాలు ఇవ్వాలి

అమ్రాబాద్: ఉమ్మడి మండలంలో సాగు చేసుకుంటున్న అటవీభూములకు పట్టాలు ఇవ్వాలని నల్లమల యురేనియం తవ్వకాల వ్యతిరేక జేఏసీ నాయకులు కలుంమల నాసరయ్య అటవీశాఖ అధికారులను డిమాండ్ చేశారు. ఈ ప్రాంతంలో ఎన్నో ఏళ్ల నుంచి సాగు చేసుకుంటున్న అటవీభూములకు పట్టాలివ్వకుండా అటవీశాఖ అధికారులు వాటిని లాక్కునేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు.

మెరుగైన వైద్యం కోసం నిరీక్షణ?

- సీహెచ్‌సీలో అందని ద్రాక్షలా వైద్యసేవలు
- పీహెచ్‌సీ స్థాయిలోనే రోగులకు వైద్యం
- ఏడాదిన్నర క్రితం ఆర్భాటంగా ప్రారంభం
- అన్ని వసతులు, పరికరాలు ఏర్పాటు
- ఖాళీగా ఉన్న డాక్టర్లు, సిబ్బంది పోస్టులు



ఉప్పునుంతలలో అధునాతన వసతులతో నిర్మించిన సీహెచ్‌సీ ఆస్పత్రి భవనం

ఉప్పునుంతల: మండల కేంద్రంలో కోట్ల రూపాయలు వెచ్చించి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) ని నిర్మించడంతో పాటు ఏడాదిన్నర క్రితం ఆస్పత్రిని ఆర్భాటంగా ప్రారంభించినా రోగులకు వైద్య సేవలు మాత్రం అందని ద్రాక్షగా మారాయి. సీహెచ్‌సీకి అన్ని వసతులతో కూడిన అధునాతన భవనం నిర్మించి జిల్లా స్థాయిలో లేనటువంటి అన్ని విభాగాలకు సంబంధించిన పరికరాలు సమకూర్చినా డాక్టర్లను, సిబ్బందిని నియమించకపోవడంతో ఏమాత్రం ఫలితం లేక ప్రజలకు వైద్య సేవలు అందడంలేదు. స్థానికంగా మెరుగైన వైద్య సేవలు అందుతాయని ఆశపడిన మండల ప్రజలు నిరాశకు లోనవుతున్నారు. సీహెచ్‌సీకి డిప్యూటేషన్‌పై రెండు మూడు నెలలు డాక్టర్‌ను నియమించి తర్వాత వెనక్కుతీసుకున్నారు. ఇద్దరు స్టాఫ్ నర్సులను డిప్యూటేషన్‌పై నియమించి ఆస్పత్రిని కొనసాగిస్తున్నారు. వారితో పాటు ఏజెన్సీ కాంట్రాక్టర్‌కు సంబంధించిన కాంటిజెన్సీ సిబ్బంది పనిచేస్తున్నారు.

రూ. 5.80 కోట్లతో సీహెచ్‌సీ..

గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో అప్పటి టీఎస్ఎంఎస్ఐడీసీ ఎండీగా కొనసాగిన చంద్రశేఖర్‌రెడ్డి చొరవతో ఉప్పునుంతల మండల కేంద్రంలో సీహెచ్‌సీని మంజూరు చేశారు. తెలంగాణ ప్రభుత్వం వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ద్వారా ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ నుంచి 2018 సెప్టెంబర్ నెలలో జీఓ నెంబర్ 145 ద్వారా ఉప్పునుంతల పీహెచ్‌సీని సీహెచ్‌సీగా స్థాయి పెంపునకు ఉత్తర్వులు జారీ చేశారు. 30 పడకల సీహెచ్‌సీ (కమ్యూనిటీ హెల్త్ సెంటర్)గా స్థాయి పెంచడానికి రూ.5,80 కోట్లతో పనులు చేపట్టడానికి పరిపాలన అనుమతులు మంజూరు చేశారు. వాటిలో కొత్త ఆస్పత్రి భవన నిర్మాణానికి రూ.3,80 కోట్లు, పరికరాల కొనుగోలుకు రూ.95 లక్షలు, డాక్టర్లు, సిబ్బంది జీతభత్యాల కోసం రూ.1.05 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నాలుగేళ్లపాటు సాగదీసీ ఆస్పత్రి భవనాన్ని 2023 చివరన హడావిడిగా ప్రారంభించారు. కేవలం ఇద్దరు స్టాఫ్ నర్సులను నియమించడంతో వారు ఇతర ప్రాంతాల నుంచి వచ్చి వెళ్తున్నారు. డెంటల్, ఎక్స్‌రే అన్ని విభాగాలకు సంబంధించిన పరికరాలు వచ్చాయి. కావల్సిన వైద్య పరికరాలు సమకూర్చినా సరిపడ డాక్టర్లు, సిబ్బందిని నియమించకపోతే ప్రయోజనం ఏమిటని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చూడటానికే పెద్దాస్పత్రి..



మండల కేంద్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన పెద్దాస్పత్రి పేరుకే ఉంది. గాని అందులో డాక్టర్లు, ఇతర సిబ్బంది సరిగా లేరు. గతంతో ఉన్న మాదిరిగా వైద్య సేవలు అందిస్తున్నారు తప్పా కొత్తగా ఏమీ లేదు. ఎప్పుడు వెళ్లినా డాక్టర్లు అందుబాటులో ఉండరు. అక్కడ ఉన్న సిస్టర్లు మాత్రమే ఇంజక్షన్, మందులు ఇచ్చి పంపిస్తారు. ఇంత పెద్ద ఆస్పత్రిని నిర్మించినా, సరిపడ డాక్టర్లను నియమించి వైద్య సేవలు అందిస్తే బాగుంటుంది.

– బత్తుల రాములమ్మ, ఉప్పునుంతల

కొత్త పోస్టులు మంజూరు కాలేదు..

రాష్ట్రంలో సీహెచ్‌సీలు (30పడకల ఆస్పత్రి)గా స్థాయిని పెంచిన ఆస్పత్రులకు భవనాలు నిర్మించి కావల్సిన పరికరాలను సమకూర్చడం జరిగింది. అందుకు కావల్సిన డాక్టర్లు, సిబ్బంది నియ మించలేదు. ప్రస్తుతం పీహెచ్‌సీ డాక్టర్లు, సిబ్బందితోనే సీహెచ్‌సీలను కొనసాగిస్తున్నాం. తరచు గా అన్ని జిల్లాల నుంచి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నాం. సీహెచ్‌సీలలో డాక్టర్లు, సిబ్బంది నిరిక్రూట్‌పై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి.

– డాక్టర్ రామకృష్ణ, జిల్లా అధికారి, తెలంగాణ వైద్య విధాన పరిషత్

నిరుపేదల అభ్యున్నతికే ప్రాధాన్యత

- ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ
- లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డుల పంపిణీ



లింగాలలో లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులను అందజేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

లింగాల: రాష్ట్రంలో నిరుపేదల అభ్యున్నతికి సీఎం కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శనివారం లబ్ధిదారులకు కొత్తగా మంజూరైన రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయుటకు ప్రభుత్వం కృషి చేస్తోందని, ఇప్పటికే పలు పథకాలు అమల్లోకి వచ్చాయన్నారు. మండలంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో కమ్యూనిటీ ప్యూర్ వాటర్ సంస్థ వారు ఏర్పాటు చేసిన ప్లాంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు.

అప్పర్ ప్లాట్‌ను అభివృద్ధి చేస్తా..

అమ్రాబాద్: అచ్చంపేట నియోజకవర్గం అభివృద్ధితో పాటు అప్పర్ ప్లాట్ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తానని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. రూ.ఆరున్నర కోట్లతో చేపట్టిన అమ్రాబాద్ రోడ్డు విస్తరణ, అండర్‌గ్రౌండ్, సెంట్రల్ లైటింగ్ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. పనులు వేగవంతంగా చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

కూలీలకు గిట్టుబాటు కల్పిస్తాం

మన్ననూర్: గ్రామాలలో ఉన్న పల్లె ప్రకృతి వనంలో పని చేసే ఉపాధి కూలీలకు గిట్టుబాటు కూలీ కల్పించే ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. మన్ననూర్‌లోని పురుగుల గుట్ట వద్ద ఉన్న పల్లె ప్రకృతి వనంలో కూలీలతో ఆయన మాట్లాడారు.

న్యాయసేవలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న నసీం సుల్తానా

కల్వకుర్తి టౌన్: ఆర్థిక స్తోమత లేక చాలా మంది పేద ప్రజలు న్యాయానికి సంబంధించిన సేవలను పొందలేకపోతున్నారని, వారందరు లీగల్‌సెల్ ద్వారా అందించే ఉచిత న్యాయసేవలను పొందాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి నసీం సుల్తానా అన్నారు. శనివారం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మండల లీగల్‌సెల్ ఆధ్వర్యంలో ప్రారంభించిన 'లీగల్ ఎయిడ్ క్లినిక్'ను కల్వకుర్తి కోర్టు జడ్జి కావ్యతో కలిసి ప్రారంభించారు. చాలా మంది ప్రజలకు న్యాయ సలహాలు తెలియక చిన్న చిన్న వాటికి ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, ముఖ్యంగా భూ తగాదాల విషయంలో ఉన్న వారికి ఇక్కడి న్యాయవాదులు తగు సలహాలను చేస్తారన్నారు. ప్రస్తుత నవీకరణ సమాజంలో వృద్ధులైన తల్లిదండ్రులను చాలామంది సరిగ్గా చూసుకోవటం లేదని, అలాంటి వృద్ధులకు తగు న్యాయసేవలను ఉచితంగా అందిస్తారన్నారు. పట్టణ ప్రాంతాలలో యువత మత్తు పదార్థాలకు బానిసలై వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. అనంతరం జడ్జి కావ్య మాట్లాడుతూ మండల లీగల్ సెల్ ద్వారా అందించే ఉచిత న్యాయ సలహాలను గ్రామాలలో సైతం తెలిసేలా అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. లీగల్ ఎయిడ్ క్లినిక్ ద్వారా ప్రతి శుక్ర, శనివారాలలో ఉచిత న్యాయ సేవలను అందిస్తారని, మరిన్ని వివరాలకు స్వేచ్ఛా రక్ష స్వచ్ఛంద సేవా సంస్థ హెల్ప్‌లైన్ 9246501211, 9949550252 సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఇబ్రహీం, లీగల్ ఎయిడ్ క్లినిక్ న్యాయవాది సుభాష్ చంద్రబోస్, న్యాయవాదులు, ప్రజలు పాల్గొన్నారు.

కళాకారులకు డప్పుల పంపిణీ



పెద్దాపూర్‌లో కళాకారులకు డప్పులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

వెల్దండ: మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామంలో ని డప్పు కళాకారులకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి డప్పులను పంపిణీ చేశారు. కల్వకుర్తి వ్యవసాయ శాఖ మార్కెట్ డైరెక్టర్ కేశమల్ల కృష్ణ పుట్టినరోజు సందర్భంగా ఎమ్మెల్యే కేక్‌కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. కళాకారులకు దాదాపుగా రూ.20వేల విలువ చేసే 10 మందికి డప్పులను అందజేశారు. కార్యక్రమంలో మట్ట వెంకటయ్య గౌడు, రాజశేఖర్, హరికిషన్‌నాయక్, అనిల్, దుబ్బతండా శ్రీనునాయక్ ఉన్నారు.

- వెల్దండలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోతిలాల్ పుట్టినరోజు వేడుకల్లో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొని సన్మానించారు. బ్లాక్ కాంగ్రెస్ నాయకులు విజయ్ కుమార్‌రెడ్డి, మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి, పర్వత్‌రెడ్డి, పుల్లయ్య, శ్రీనివాస్‌యాదవ్, శేఖర్ ఉన్నారు.

కల్వకుర్తి ఆర్డీఓగా జనార్దన్‌రెడ్డి

కల్వకుర్తి టౌన్: కల్వకుర్తి నూతన ఆర్డీఓగా జనార్దన్ రెడ్డిని నియమిస్తూ రెవెన్యూశాఖ పరిపాలన ఉత్తర్వులు జారీ చేసింది. మైనారిటీ వెల్ఫేర్ శాఖలో డిప్యూటేషన్ బేసిస్‌లో పనిచేస్తున్న ఇతనికి రెగ్యులర్ పోస్టింగ్ లభించింది. గతంలో ఇక్కడ పనిచేసిన శ్రీనునాయక్ పదోన్నతి పొంది స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా నారాయణపేటకు బదిలీ అయ్యారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి



తాడూరు: అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో స్థానిక బస్టాండ్ దగ్గర నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వకుండా కేవలం కొద్ది మందికి మాత్రం ఇచ్చి మిగతా కొంత మందిని నిర్లక్ష్యానికి గురి చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఏ.కాశన్న, శ్యాంసుందర్, వెంకటస్వామి, కాశన్న, ఆంజనేయులు ఉన్నారు.

తల్లిపాలే బిడ్డ ఆరోగ్యానికి శ్రేయస్కరం



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీఓ దమయంతి


ఉప్పునుంతల: తల్లిపాలే బిడ్డ ఆరోగ్యంగా ఎదుగుదలకు శ్రేయస్కరమని సీడీపీఓ దమయంతి అన్నారు. శనివారం మండలంలోని పెద్దాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాలలో సీడీపీఓ పాల్గొని మాట్లాడారు. తల్లిపాల ప్రాముఖ్యతపై వివరించారు. గర్భిణీలు, బాలింతలు స్థానికంగా లభించే పోషక విలువలుగల ఆకుకూరలు, కూరగాయలతోపాటు పండ్లు, గుడ్లు ఆహారంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ అభిలాష్ కుమార్, ఏఎన్ఎం లక్ష్మి, పోషణ అభియాన్ కో ఆర్డినేటర్ పార్వతి, అంగన్‌వాడీ టీచర్లు శ్రీలత, నీరంజనమ్మ పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి: మండలంలోని కల్వకోలు గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు, అన్నప్రసన సీడీపీఓ జయశ్రీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయలలిత, ఏఎన్ఎం వెంకటమ్మ, అంగన్‌వాడీ టీచర్లు శ్రీలత, సాయిలీల, పార్వతమ్మ , లక్ష్మి, పద్మ, సువర్ణ పాల్గొన్నారు.


లింగాల: మండల కేంద్రంలోని సబ్ సెంటర్‌లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గిరిజ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను ప్రారంభించారు.

కోడేరు: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ దూరెడ్డి లక్ష్మి మాట్లాడారు. హైమావతి పాల్గొన్నారు.


రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు విద్యార్థినుల ఎంపిక




నందిని



నాగలక్ష్మి



జ్ఞానేశ్వరి



మానస

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని బీసీ గురుకుల కళాశాల విద్యార్థినులు నలుగురు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. కళాశాలలో చదువుతున్న జ్ఞానేశ్వరి, మానస, నాగలక్ష్మి, నందిని ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ యామిని తెలిపారు. 100 మీటర్ల పరుగులో వీరంతా అద్భుత ప్రదర్శన చేయడంతో హన్మకొండకు తరలి వెళ్లారు. కల్వకుర్తి లోని కళాశాలలో కల్వకుర్తి, ఊరుకొండ, వెల్టూరు, హన్వాడ, భూత్పూర్, ఉయ్యాలవాడ, కోటకొండ కళాశాలలున్నాయి. నారాయణపేట జిల్లా నుంచి నందిని, మహబూబ్‌నగర్ నుంచి నాగలక్ష్మి, వనపర్తి జిల్లా నుంచి జ్ఞానేశ్వరి, నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి మానసలు రాష్ట్రస్థాయి పోటీలలో ప్రాతినిధ్యం వహించనున్నారు. కళాశాల పీడీ బాలశ్రీ, లాలమ్మ వారికి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు.

మాదక ద్రవ్యాల నివారణపై చిత్రలేఖనం పోటీలు

తాడూరు: మండల కేంద్రంలోని కుచుకుళ్ళ సౌభాగ్య కళాశాలలో మాదక ద్రవ్యాల నివారణ, మానవ అక్రమ రవాణా నిర్మూలనపైన అవగాహన నిమిత్తం శనివారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నోడల్ అధికారి, కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరమణ మాట్లాడుతూ డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన పాఠశాల, కళాశాల నుంచి ప్రారంభించాలని, అందుకు అధ్యాపకులు విద్యార్థులు కలిసి ఉద్యమించాలన్నారు. కౌన్సిలర్ నర్రా ప్రవీన్‌రెడ్డి మాట్లాడారు. ఎన్ఎస్ పిఓ మురళి కృష్ణ అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇసుక రవాణాను ఆపాలి

చారకొండ: మండలంలోని అనుమతి పేరిట అక్రమంగా ఇసుక తరలింపును సంబంధిత అధికారులు కట్టడి చేయాలని బీజేపీ మండల నాయకుడు చింతపల్లి కిరణ్‌గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో మట్లాడారు. మండల కేంద్రంతో పాటు గోకారం చెరువు నుంచి ఇసుకను అధికార పార్టీ నాయకులు, అధికారులు అండదండలతో ఇందిరమ్మ ఇళ్ల అనుమతులతో చెరువుల్లో అక్రమంగా దూర ప్రాంతాలకు తరలిస్తున్నారని ఆరోపించారు.

నిత్యాన్నదానానికి విరాళం

అచ్చంపేట రూరల్: శ్రీశైల ఉత్తర ముఖద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానానికి దాతలు సహకరిస్తున్నారని ఆలయ కమిటీ చైర్మన్ బీరం మాధవరెడ్డి, ఈఓ శ్రీనివాసరావు అన్నారు. శనివారం హైదరాబాద్ వాస్తవ్యులు బిక్షపతిగౌడ్, నాగమణి దంపతులు నిత్యాన్నదానానికి రూ.25,116లు అందించారు. ఆలయ కమిటీ నుంచి దాతలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైయినేజీ పూడ్చిన వ్యక్తిపై ఫిర్యాదు

తాడూరు: మండలంలోని ఇంద్రకల్, యాదిరెడ్డిపల్లి మధ్య ఆర్అండ్‌బీ రోడ్డు అనుసరించుకొని ఉన్న కాల్వ రోడ్డు పక్కన నాటిన మొక్కలను తొలగించిన బాల్‌రెడ్డిపై గ్రామస్తులు శనివారం అధికారులకు ఫిర్యాదు చేశారు. గ్రామం నుంచి యాదిరెడ్డిపల్లి ఆర్ అండ్ బీ రోడ్డు ఉపాధి హామీ పథకంలో భాగంగా నిర్మించిన మురికి కాల్వను పూడ్చివేశారు. దీంతో మురుగు గ్రామంలోకి తిరిగి రావడం వల్ల పలు ఇబ్బందులు ఎదురయ్యాయి. గ్రామస్తులు పరిశీలించి జేసీబీ ద్వారా మురుగు వెళ్లేందుకు కాల్వను పునఃప్రారంభించారు. అనంతరం గ్రామస్తులు ఎస్ఐ గురుస్వామికి, తహసీల్దార్ జయంతికి ఫిర్యాదు చేశారు.

పారిశుద్ధ్యంపై శ్రద్ధ వహించాలి

చారకొండ: గ్రామాల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీడీఓ శంకర్ నాయక్ అన్నారు. మండల కేంద్రంతో పాటు మండలంలోని మర్రిపల్లిని శనివారం పర్యటించారు. పారిశుద్ధ్యంపై ఆరా తీశారు. అనంతరం పంచాయతీ కార్యాలయాల్లో తనిఖీ చేసి సంబంధిత రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు గణేష్, రవికుమార్ ఉన్నారు.

ఏరియా ఆస్పత్రిలో సమస్యలు పరిష్కరించాలి

అచ్చంపేట రూరల్: అచ్చంపేట ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో సమస్యలు పరిష్కరించాలని సీపీఎం జిల్లా నాయకుడు శంకర్‌నాయక్ డిమాండ్ చేశారు. శనివారం సీపీఎం ఆధ్వర్యంలో ఆస్పత్రిని పరిశీలించి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఆస్పత్రిలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, ప్రైవేట్ ఆస్పత్రికి రెఫర్ చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సైదులు, రాములు, శివకుమార్, రామన్న పాల్గొన్నారు.

బీటీ రోడ్లతో అభివృద్ధి

చారకొండ: గ్రామాల అభివృద్ధి జరగాలంటే రోడ్డు రావాణా ముఖ్యమని, బీటీ రోడ్డుతో గ్రామాల అభివృద్ధి తథ్యమని మాజీ జెడ్పీటీసీ గుండె వెంకట్‌గౌడ్ అన్నారు. శనివారం బీటీ రోడ్డు నిర్మాణ పనులను ఆయనతో పాటు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జమ్మికింది బాల్‌రాం గౌడ్, నాయకులు ప్రారంభించారు. మండల కేంద్రం నుంచి రాంపురం వరకు 3 కి.మీ. మే రకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.3.5 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో సీని యర్ నాయకులు నర్సింహారెడ్డి, సురేందర్ రెడ్డి, శ్రీను, గణేష్, సందీప్‌రెడ్డి ఉన్నారు.

జీవన ఎరువులపై రైతులకు అవగాహన

కొల్లాపూర్ రూరల్: మండలంలోని ఎల్లూరులో వరిలో పీఎస్‌బీ జీవన ఎరువు వాడకంపై క్షేత్ర స్థాయిలో వ్యవసాయ అధికారులు శనివారం అవగాహన కల్పించారు. వ్యవసాయ అధికారులు మాట్లాడుతూ ఈ జీవన ఎరువును వాడటం వల్ల భూమిలో లభ్యం కాని స్థితిలో ఉన్న భాస్వరంను కరిగించి మొక్కకి అందుబాటులోకి తెస్తుందన్నారు. దీనిని ఏ విధంగా వాడాలో రైతులకు అవగాహన కల్పించారు. రైతులు కాంప్లెక్స్ ఎరువులు ఎక్కువ మోతాదులో వాడడం వల్ల భాస్వరం 20 శాతం మాత్రమే అందుబాటులో ఉండి మిగతా 80 శాతం లభ్యం కాని స్థితిలో భూమిలో ఉండిపోతుందన్నారు. దీని వల్ల సూక్ష్మ పోషకాలైన ఐరన్ జింక్ తోపాటు ఎక్కువగా కనిపిస్తాయన్నారు. లభ్యం కాని స్థితిలో ఉన్న ఈ భాస్వరాన్ని ఫాస్ఫరస్ పోలిబెలైజింగ్ బ్యాక్టీరియా కరిగించి మొక్కకు అందిస్తుందన్నారు. జీవన ఎరువులను మూడు పద్ధతులలో ఉపయోగించవచ్చన్నారు. మండల వ్యవసాయ అధికారి చిన్న హుస్సేన్, ఏఈఓలు మౌనిక, శిరీషరాణి, మోహన్, రైతులు శ్రీరామ్‌రెడ్డి, వెంకటకృష్ణారెడ్డి ఉన్నారు.

నీలి నాలుక వ్యాధి నివారణకు టీకాలు



గొర్రెలకు టీకాలు వేస్తున్న డాక్టర్ ఉదయ్‌కుమార్‌రెడ్డి, సిబ్బంది

తిమ్మాజిపేట: గొర్రెలలో నీలి నాలుక వ్యాధి నివారణకు సకాలంలో టీకాలు ఇప్పించాలని మండల పశువైద్యాధికారి ఉదయ్‌కుమార్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రం తిమ్మాజిపేట, మండలంలోని నేరళ్లపల్లి గ్రామాలలో శనివారం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గొర్రెలకు ప్రత్యేక టీకాల కార్యక్రమం చేపట్టారు. ఆయా గ్రామాలలో గొర్రెల కాపారులకు, గొర్రెల యజమానులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. గొర్రెలలో నీలి నాలుక వ్యాధి రావడానికి గల కారణాలను వివరించారు. వ్యాధి నివారణకు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నామని గొర్రెల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఒక్క రోజే 784 గొర్రెలకు వ్యాధి నిరోధక టీకాలు వేసినట్లు ఆయన తెలిపారు. ఎల్ఎస్ఏ తిరుపతయ్య, జేవీఓ విజయలలిత, ఒఎస్‌లు అమీర్, శాంతయ్య, రవి పాల్గొన్నారు.

కార్యదర్శులు అందుబాటులో ఉండాలి



తాడూరు: మండల కేంద్రంతో అయా గ్రామాల కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, వారి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఎంపీడీఓ ఆంజనేయులు తెలిపా రు. శనివారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉపాధి హామీ సిబ్బంది పంచాయతీ కార్యదర్శులతో సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ పనుల్లో పాల్గొనే కూలీలను ఉదయం, సాయంత్రం పని దగ్గర ఫొటోలు తీయడంతో పాటు రెగ్యులర్‌గా ఇచ్చిన యాప్‌లో వివరాలను నమోదు చేయాలన్నారు. సమావేశంలో ఎంపీఓ నర్సింహులుతో పాటు అయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

తిమ్మాజిపేట: గ్రామాల్లో నిర్వహిస్తున్న అభివృద్ధి పనులపై ఆయా శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ లక్ష్మీదేవి సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం సాయంత్రం ఉపాధిహామీ, పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నేషనల్ మానిటరింగ్ సిస్టమ్ పకడ్బందీగా అమలు చేయాలన్నారు.

ఆర్థిక సాయం

పెద్దకొత్తపల్లి: దేవునితిర్మలాపూర్ గ్రామానికి చెందిన కేశంపేట శ్రీనివాసులు (42) కల్వకుర్తి సీపీఐ సభలో గుండె పోటుతో మృతి చెందాడు. బాధిత కుటుంబానికి మాజీ ఎంపీపీ సూర్య ప్రతాప్‌గౌడు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు.


ఆధ్యాత్మిక భావంతో మెలగాలి

కల్వకుర్తి రూరల్: సమాజంలోని ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావం కలిగి ఉండాలని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘువేందర్ రెడ్డి కోరారు. శనివారం కల్వకుర్తి మండలం లింగసానిపల్లి గ్రామంలో నిర్మాణం చేస్తున్న శివాలయం, రామాలయాలను సందర్శించారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి చెప్పారు. కార్యక్రమంలో రాములు, శేఖర్ రెడ్డి, వినోద్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, నాగరాజు, శ్రీనివాసచారి ఉన్నారు.

ఇష్టంతో చదవాలి

తెలకపల్లి: విద్యార్థులు ఇష్టంతో చదివి ఇష్టంతో చదివి ఉన్నతంగా ఎదగాలని ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పెద్దూరు ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. అనంతరం ప్లానింగ్, బెస్‌లైన్ పత్రాలను, ఎఫ్ఏ పరీక్ష పత్రాలను, రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యాయులు ఎఫ్ఆర్ఎఫ్ గురించు చేసుకోవాలని అన్నారు.

టాస్క్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు



కల్వకుర్తి టౌన్: డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు చదువు పూర్తి కాగానే వెంటనే ఉద్యోగావకాశాలు వచ్చే విధంగా టాస్క్ వారికి తోడ్పడుతుందని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కో–ఆర్డినేటర్ మహ్మద్ సిరాజ్ విద్యార్థులకు సూచించారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ మాడల్ డిగ్రీ కళాశాలలో టాస్క్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ డా.శ్రీపాద శార్వాణితో కలిసి పాల్గొన్నారు. కార్యక్రమంలో కళాశాల లెక్చరర్లు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.